TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 86 | సోమవారం 24-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## టిమ్స్‌పై సర్కారుది నేరపూరిత నిర్లక్ష్యం

**హైదరాబాద్, నవంబరు 23:**



ప్రభుత్వ భూములను తెగనమ్మడంపై సీఎంకు ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్య సేవలందించే ఆసుపత్రులపై లేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులనిర్మాణాలు పూర్తిచేయకుండా, పేదలకు వైద్యం అందించకుండా దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యం చూపుతోందన్నారు. వీటిని ఎప్పుడు ప్రారంభిస్తారో కోతల రేవంత్‌రెడ్డి చెప్పాలని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన డిమాండ్ చేశారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులపై ప్రభుత్వం తీరు చూస్తే నత్త కూడా ఆత్మహత్య చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. సీఎం సహా కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదని చెప్పడానికి టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంలో జాప్యమే నిదర్శనమన్నారు.

## రచయిత్రి సుధాదేవి రామరాజు కన్నుమూత

**నల్లకుంట/చిక్కడపల్లి, నవంబరు 23:**



ప్రముఖ రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధాదేవి రామరాజు(73) ఆదివారం సాయంత్రం నల్లకుంటలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆమెకు భర్త డాక్టర్ వంశీ రామరాజు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వంశీ ఇంటర్నేషనల్ సాంస్కృతిక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు సతీమణి డాక్టర్ తెన్నేటి సుధాదేవి తెలుగు అకాడమీలో ఉపసంచాలకులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా రచనలు కొనసాగించారు. తెలుగు సామెతలు, నాటికలతో సాహిత్య ప్రక్రియలో 20కిపైగా రచనలు చేసి పలు సంస్థలచే అవార్డులు, రివార్డులు అందుకున్నారు. నల్లకుంటలోని నివాసంలో సుధాదేవి భౌతికకాయాన్ని సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత రామ సత్యనారాయణతోపాటు పలువురు ప్రముఖులు సందర్శించి, నివాళులర్పించారు. సుధాదేవి రామరాజు అంత్యక్రియలు సోమవారం ఉదయం అంబర్‌పేట శ్మశాన వాటికలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### సత్యసాయి.. ప్రజల్లో దేవుడిని చూసిన

# మహానుభావుడు

**తెలంగాణలోనూ అధికారికంగా శతజయంతి ఉత్సవాలు**

**బాబా ట్రస్టు కార్యక్రమాలకు తోడ్పడతాం: సీఎం రేవంత్**

**నిస్వార్థ సేవలకు ప్రతిరూపం: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

**పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు**



**అనంతపురం/పుట్టపర్తి, నవంబరు 23:** భగవాన్ సత్యసాయి ప్రజల్లోనే దేవుడిని చూశారని, ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనేది ఆయన సందేశమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాబా సందేశం యుగయుగాలపాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణలోనూ సాయిబాబా శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బాబా సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు, ఆయన సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేయడానికి తమ ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో రేవంత్ ప్రసంగించారు. "తన సేవలతో ప్రజలలో సత్యసాయి దేవుడయ్యారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించడం ద్వారా ట్రస్టు లక్షలాది మంది జీవితాలకు వెలుగునిచ్చింది. ప్రభుత్వాలకు సరితూగే స్థాయిలో, కొన్ని సందర్భాల్లో అంతకుమించి సేవలు అందిస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలు అందని ప్రాంతాల్లో బాబా ఆస్పత్రులు అనేక మందికి ప్రాణదానం చేస్తున్నాయి. తెలంగాణలోని పాలమూరు, ఏపీలో అనంతపురం జిల్లా లాంటి కరువు ప్రాంతాల్లో ప్రభుత్వాలు పరిష్కరించలేని తాగునీటి సమస్యను బాబా ట్రస్టు పరిష్కరించింది. అందుకే సత్యసాయి ప్రాణమిచ్చే దేవుడి స్థానాన్ని పొందారు" అని రేవంత్ పేర్కొన్నారు. శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవలకు భగవాన్ సత్యసాయిబాబా ప్రతిరూపమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆయన బోధనలు.. 'అందరినీ ప్రేమించు-అందరినీ సేవించు, ఎల్లప్పుడూ సాయపడు, ఎన్నటికీ బాధించకు' వంటివి విశ్వవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. 1964-65 మధ్య తన కుటుంబానికి సత్యసాయి ఆశీస్సులు అందా యని.. తమిళం మాత్రమే తెలిసిన తన అత్తయ్య ఒంటరిగా పుట్టపర్తికి వచ్చి, 15 రోజులు ఇక్కడ ఉండి బాబా ఆశీస్సుల అందుకోవడం దైవిక శక్తికి నిదర్శనమని గుర్తు చేసుకున్నారు.

మిగతా 4లో...

### లంబాడాలను ఎస్టీల నుంచి

# తొలగించాల్సిందే

**ఉట్నూర్ ధర్మ యుద్ధం మహాసభలో డిమాండ్**

**కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు**



**ఉట్నూర్, నవంబరు 23:** లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాల్సిందేనని ఆదివాసీలు డిమాండ్ చేశారు. సామాజికంగా, ఆర్థికంగా తమ కంటే ఎన్నో రెట్లు ముందున్న లంబాడాలు.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గిరిజన కోటా అవకాశాలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. చదువు, చైతన్యం లేక గూడేలకే పరిమితమై.. అనేక రంగాల్లో వెనుకబడిన ఆదివాసీలు.. లంబాడాలతో పోటీ పడలేకపోతున్నారని అన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో బీసీ కోటాలో ఉన్న లంబాడాలను.. తెలంగాణలో కూడా అదే జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఎంపీడీవో గ్రౌండ్‌లో ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 'ఆదివాసీల ధర్మ యుద్ధం మహాసభ' జరిగింది. లంబాడాలను ఎస్టీల నుంచి తొలగించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ తరహాలో రాజకీయ చైతన్యం పొంది, ఉద్యమాలు చేయాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఆదివాసీ సంఘాలతో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. రాష్ట్రంలోని విద్య, ఉద్యోగ రాజకీయ అవకాశాల్లో ఆదివాసీలు నష్టపోతున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. ప్రభుత్వం దిగి రావాలంటే ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# నేడో.. రేపో.. నగారా..!

**పంచాయతీ, వార్డుల రిజర్వేషన్లపై జిల్లాల్లో గెజిట్‌ల జారీ**

**నేడు ఎస్ఈసీకి అందజేయనున్న పీఆర్**




**హైదరాబాద్, నవంబరు 23:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ నెల 26న ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణను సైతం తొందర్లోనే పూర్తిచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీలకు జరగబోయే ఎన్నికలకు సంబంధించి.. ఆయా జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా.. వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేయగా, సర్పంచుల రిజర్వేషన్లను ఆర్‌డీవోలు సిద్ధం చేశారు. ఎంపీడీవోలు, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల వారీగా రూపొందించిన రిజర్వేషన్ల జాబితా కలెక్టర్లకు సమర్పించారు. వారు అందించిన వివరాల ఆధారంగా నిబంధనలను సరిపోల్చుకుని.. జిల్లాల వారీగా (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా) సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ను కలెక్టర్లు ఆదివారం విడుదల చేశారు. గెజిట్ కాపీలను పూర్తి సమాచారంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆన్‌లైన్‌లో చేరవేశారు. జిల్లాల వారీగా రిజర్వేషన్లకు సంబంధించిన జాబితా ఇప్పటికే ప్రజా సంబంధాల శాఖకు చేరింది. ఏ జిల్లానుంచైనా రావాల్సిన తుది జాబితా ఉంటే, సోమవారం ఉదయంలోపు సేకరించి.. రాష్ట్ర ఎన్నిల సంఘానికి సమర్పించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన తర్వాతనే ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమం అవుతుంది. రిజర్వేషన్లను సూచిస్తూ.. జిల్లాల్లో విడుదలైన గెజిట్ సమాచారం ఆధారంగానే ఎస్ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా 12,760 సర్పంచు, 1,12,534 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలు సిద్ధం అయ్యాయి. ఓటర్లు ఒక వార్డు నుంచి మరో వార్డుకు మారడం, ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకేవార్డులో ఉండేలా మ్యాపింగ్‌లో తప్పులు సరిదిద్దే ప్రక్రియ పూర్తయింది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు అందడంతో అధికారులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. పార్టీ గుర్తుల్లేకుండానే సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలు చేపడుతున్నప్పటికీ.. ఆయా గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల్లో, గెలుపు గుర్రాలపై రాజకీయ పార్టీలు దృష్టిపెట్టాయి. పోటీ చేయాలనుకునే వారు సైతం ఆయా పార్టీల మద్దతు కూడగట్టుకుంటూనే, ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. తమ మద్దతుతో గెలిచే అభ్యర్థు?ల ద్వారా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలన్న యోచనలో ఆయా పార్టీలు.. కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటున్నాయి.

# మీ కష్టం నాకు తెలుసు

**నేనూ రైతు బిడ్డనే.. మీకు అండగా ఉంటా.. అన్నదాతలకు చంద్రబాబు లేఖ**

**నేటి నుంచి 'రైతన్నా.. మీ కోసం'**

**లాభసాటి సాగుకు పంచసూత్రాలపై అవగాహన**

**అన్నదాతల ఇళ్లకు తరలిరానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు**

**ఆర్థిక సాధానికి మూల స్తంభం వ్యవసాయమే**


**పంటల మార్పిడి పాటించాలి**

**చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి**

**ప్రకృతి వ్యవసాయం అవలంబించాలి**

**ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు మరింత విలువ**

**13 వేల కోట్లతో 38 పరిశ్రమలకు ఎంవోయూలు**



**అమరావతి, నవంబరు 23:** పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం సోమవారం నుంచి చేపడుతోంది. వారం రోజులు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అన్నదాతల ఇళ్లకే రానున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి రాసిన లేఖను కరపత్రం రూపంలో అందించనున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి అందిస్తున్న.. ఇకపై చేపట్టనున్న చర్యలను ఆయన అందులో ప్రస్తావించారు. కొత్త ఆలోచనలు పంచుకుంటూ, మార్పునకు నాంది పలకడానికి ప్రభుత్వానికి అన్నదాతలందరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తానూ పాల్గొంటానని సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. సంక్షిప్తంగా ఆయన లేఖ సారాంశమిదీ.. నేనూ రైతు బిడ్డనే.. రాష్ట్రంలోని ప్రతి కర్షకుడి కష్టం నాకు తెలుసు. మీతో కలిసి నడవడానికి, మీ సమస్యలను పరిష్కరించడానికి, మీకు పూర్తి అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నా. రాష్ట్ర ఆర్థిక సాధానికి మూల స్తంభం.. వ్యవసాయ రంగమే. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలు రాష్ట్ర జీఎస్‌డీపీలో 35శాతం వరకు వాటా అందిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. 2047 నాటికి ప్రజల తలసరి ఆదాయం రూ.55 లక్షలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటున ఏడాదికి 15% వృద్ధి రేటు సాధించాలని నిర్దేశించుకున్నాం.

మిగతా 4లో...

# పుట్టి పెరిగిన ఊరు రుణం తీర్చుకుంటా..

**- రహత్‌నగర్‌ను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతా: మహేశ్ గౌడ్ - 11 ఎకరాల భూమిని గ్రామాభివృద్ధికి విరాళం ఇచ్చిన పీసీసీ చీఫ్**

**భీమ్‌గల్ రూరల్/నిజామాబాద్ సిటీ, నవంబరు 23:** తాను పుట్టి పెరిగిన మారుమూల గ్రామమైన రహత్‌నగర్ రుణం తీర్చుకుంటానని.. రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చుదిద్దుతానని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. తన తల్లిదండ్రులు చేసిన సేవల వల్లే ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని రహత్‌నగర్‌లో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలను మంజూరు చేయించిన మహేశ్ గౌడ్.. ఆ నిర్మాణ పనులకు స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆదివారం భూమి పూజ చేశారు. మహేశ్ గౌడ్ ఊరిలోకి అడుగుపెట్టగానే గ్రామస్థులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రహత్‌నగర్ గ్రామాభివృద్ధి కోసం మహేశ్ గౌడ్ తన 11 ఎకరాల సొంత భూమిని విరాళంగా ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 10 ఎకరాలు, సబ్ స్టేషన్‌కు ఎకరా భూమి ఇచ్చానని, తన గ్రామానికి ఎంత సేవ చేసినా తక్కువేనన్నారు. రహత్‌నగర్ మీదుగా కొండగట్టు ఆంజనేయ స్వామి, వేములవాడ, ధర్మపురి దేవాలయాలను కలుపుతూ టెంపుల్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి రూ.380 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల తమ గ్రామం అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఎగరవేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు.

# ప్రభుత్వ వ్యతిరేక తీర్పులు ఇవ్వక్కర్లేదు

**అలా ఇస్తేనే స్వతంత్రంగా వ్యవహరించే జడ్జి అనుకుంటారనే భావన సరికాదు**

**కోర్టు ముందున్న పత్రాలు, ఆధారాల మేరకే తీర్పులు ఇవ్వాలి**

**ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలి: జస్టిస్ బీఆర్ గవాయ్**



**న్యూఢిల్లీ, నవంబరు 23:** ఎవరైనా న్యాయమూర్తి తాను స్వతంత్రుడనని నిరూపించుకునేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వాల్సిన పనిలేదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అయితే న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించక తప్పదని, కోర్టు ముందున్న ఆధారాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. విద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఒక చట్టం అవసరమని చెప్పారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ఆదివారం పదవీ విరమణ చేసిన జస్టిస్ గవాయ్ తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. "ఒక న్యాయమూర్తిగా తమ ఎదుట ఉన్నది ప్రభుత్వమా, ప్రైవేటు వ్యక్తులా అన్నదానిని బట్టి నిర్ణయం తీసుకోకూడదు. కోర్టు ముందున్న పత్రాలు, ఆధారాలను బట్టి నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటేనే స్వతంత్రంగా వ్యవహరించే జడ్జి అనే భావన కొందరిలో ఉంది. అది సరికాదు. స్వతంత్రంగా వ్యవహరించే న్యాయమూర్తి అని నిరూపించుకునేందుకు ప్రభుత్వం చేసే ప్రతిదానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వాల్సిన అవసరం లేదు" అని గవాయ్ చెప్పారు. ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కొనసాగాలంటే.. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించాల్సిందేనని జస్టిస్ గవాయ్ చెప్పారు. జడ్జీల నియామకాలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థపై కొన్ని విమర్శలు ఉన్నా.. న్యాయవ్యవస్థ స్వతంత్రతను నిలుపుకొనేందుకు అది తప్పనిసరని పేర్కొన్నారు. అదే సమయంలో నిఘా, దర్యాప్తు సంస్థలు, కేంద్ర న్యాయశాఖ నుంచి వచ్చే నివేదికలు, సూచనలను కొలీజియం కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. కొందరు మహిళా న్యాయమూర్తులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించే ప్రతిపాదనను పరిశీలించామని.. కానీ కొలీజియంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో నియమించలేకపోయామని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. గవర్నర్లకు గడువు విధించలేమన్న తాజా తీర్పుపై విమర్శలను ప్రస్తావించగా.. "రాజ్యాంగంలో లేని దానిని మేం చెప్పలేం.

## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వమే అండగా నిలవాలి: కవిత

- వనపర్తి కొత్తకోటలో జాగృతి 'జనం బాట'
- చేనేత కార్మికుల దుర్భర పరిస్థితిపై ఆందోళన
- పద్మశాలీలకు ప్రాధాన్యం, బీసీలకు రాజ్యాంగ రిజర్వేషన్లపై డిమాండ్





**కొత్తకోట, 23 నవంబర్:** వనపర్తి జిల్లా కొత్తకోటలో చేనేత కార్మికులను కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. చేనేతే నాగరికతకు ప్రతీకైనా, దానిని నేసే కార్మికులు దయనీయ జీవితాలు గడుపుతున్నారనే విషయాన్ని ఆమె ఆవేదనగా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుంచే దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పెన్షన్, నూలుకు సబ్సిడీ అందించడంతో కొంత ఊరట లభించిందని కవిత గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ కాలంలో సబ్సిడీలు నిలిచిపోవడం వల్ల కార్మికులు మరింత కష్టాల్లోకి నెట్టబడుతున్నారని ఆమె అన్నారు. చేనేత కుటుంబంలో ఒక్కరికి చేనేత పెన్షన్ వచ్చినా, సాధారణ పెన్షన్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చీరలు నేసినా, సొంతంగా వ్యాపారం చేయలేక కూలీ పనులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేసి, లోన్లు అందజేస్తేనే చేనేత రంగానికి కొంత ప్రోత్సాహం లభిస్తుందని సూచించారు. కొత్త తరం ఈ కళను అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ అండ తప్పనిసరిగా అవసరమని, లేనిపక్షంలో చేనేత కళ అంతరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పద్మశాలీల జనాభా పెద్దది అయినప్పటికీ ఏ ప్రధాన రాజకీయ పార్టీ వారిని నిర్ణాయక పదవుల్లోకి తీసుకురాలేదని ఆమె విమర్శించారు. అన్నిరాజకీయ పార్టీలూ వారికి ప్రాధాన్యం ఇవ్వాలని, అదే విధంగా బీసీ వర్గాలకు పార్టీల ఆధారంగా కాకుండా రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే వర్గాల తరఫున సమస్యలు ప్రభుత్వ స్థాయిలో ధైర్యంగా చెప్పగలరని అభిప్రాయపడ్డారు. కొత్తకోట చేనేత కళాకారుల కష్టాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు కవిత చెప్పారు. బట్ట నేయడంలో వారు పడుతున్న శ్రమ అపారమని, వారిని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జాగృతి తరఫున కూడా వీలైనంత సహాయం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# టిమ్స్ ఆసుపత్రులపై హరీశ్‌రావు ఫైర్

- "డేట్లు, డెడ్‌లైన్లు మార్చడం తప్ప ఏం చేస్తున్నారు?" సీఎం రేవంత్‌పై విమర్శలు
- పనుల్లో జాప్యం ప్రభుత్వ పరమైన వైఫల్యమని ఆరోపణ
- పేదలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది అని వ్యాఖ్య



**హైదరాబాద్, 23 నవంబర్:** సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని నెలరోజుల్లో ప్రారంభిస్తామని అక్టోబర్ 23న ప్రభుత్వం ప్రకటించి, ఇప్పటికీ లోటుపాట్లు మార్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నెల గడిచినా ఆసుపత్రి ప్రారంభం పై స్పష్టత లేకపోవడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. "ఈరోజే ప్రారంభమా? లేక మళ్లీ మరో కొత్త తేదీ ప్రకటించబోతున్నారా?" అని ప్రభుత్వం వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాల్లో రెండేళ్లుగా డేట్లు, డెడ్‌లైన్లు మాత్రమే మార్చుతున్నారని, వాస్తవ పురోగతి లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ భూములను రక్షించడంపై ఉన్న శ్రద్ధ, పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులపై లేదని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో గప్పాలు కొట్టడం తప్ప, రేవంత్ ప్రభుత్వం ఆసుపత్రుల పనుల్లో ఏ మాత్రం ముందడుగు వేయలేదని ఆయన వ్యాఖ్యానించారు. సనత్‌నగర్, ఆల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రుల పనుల్లో జరుగుతున్న నత్తనడక ప్రభుత్వ అసమర్థతను చూపుతోందని హరీశ్‌రావు అన్నారు. "మాటలు కోటలు దాటినా, పనులు ఆచరణలోకి రావడం లేదని చెప్పడానికి పూర్తికాని ఆసుపత్రులే నిదర్శనం" అని పేర్కొన్నారు. కమీషన్ల కోసం ఉద్దేశపూర్వకంగా పనులను ఆపేయడం ప్రజలపై 'క్రిమినల్ నెగ్లిజెన్స్' అని ధ్వజమెత్తారు. టిమ్స్ ఆసుపత్రుల రూపకల్పనను కేసీఆర్ కరోనా తరువాత వందేళ్ల ముందుచూపుతో చేసినట్లు గుర్తుచేసిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఈ నిర్మాణాలు శరవేగంగా జరిగాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయంటూ ఆరోపించారు. కేసీఆర్‌కు క్రెడిట్ వెళ్లిపోతుందనే కురచబుద్ధితో రేవంత్ రెడ్డి పనులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తపేట టిమ్స్ ఆసుపత్రి సందర్శన తర్వాత కూడా ఒకడుగు ముందుకు పడకపోవడం ప్రభుత్వ వైఖరిని చూపిస్తోందని హరీశ్‌రావు అన్నారు. వేగంగా పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చినా, ఆ మాటలకు విలువ లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. పేదలకు ఉత్తమ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ ఆసుపత్రులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల సేవలోకి తీసుకురావాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# తెలంగాణ మంత్రుల వాట్సాప్ గ్రూపులు హ్యాక్


- సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం - ఎస్‌బీఐ కేవైసీ పేరుతో అపాయ ఏపీకే ఫైళ్లు షేర్
- మంత్రులు, పీఆర్వోలు, జర్నలిస్టుల ఫోన్లు టార్గెట్ - అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ హెచ్చరిక




**హైదరాబాద్, 23 నవంబర్ :** తెలంగాణ మంత్రులు, సీఎంవో, డిప్యూటీ సీఎం అధికారిక వాట్సాప్ గ్రూపులు సైబర్ నేరగాళ్ల టార్గెట్‌గా మారాయి. ఎస్‌బీఐ కేవైసీ అప్‌డేట్ పేరుతో ఏపీకే ఫైళ్లను గ్రూపుల్లో షేర్ చేస్తూ, వాటిని ఓపెన్ చేస్తే ఫోన్లు హ్యాకింగ్‌కు గురయ్యేలా పన్నాగం పన్నుతున్నట్లు సమాచారం. మంత్రుల అధికారిక గ్రూపులతో పాటు పీఆర్వోలు, మీడియా గ్రూపుల్లోనూ ఇదే విధంగా ఏపీకే ఫైళ్లు పంపబడుతున్నాయి. జర్నలిస్టుల ఫోన్లు కూడా ప్రభావితమయ్యాయనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్రూపుల్లోకి **APK** ఫైళ్లు ప్రవేశించడం ఆందోళన కలిగించే విషయం అని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటన వెలుగులోకి రాగానే తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏ విధమైన ఏపీకే ఫైళ్లు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయొద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద లింకులు, కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే మెసేజ్‌లు క్లిక్ చేస్తే డేటా దొంగిలింపు ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటువంటి సైబర్ మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు, అధికారులకు సూచించారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నల్లమల సాగర్.. ముందస్తు జాగ్రత్తలు తప్పవు





పోలవరం బనకచర్ల అనుసంధానం అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక మెట్టు దిగడం శుభ సూచికమే! దీంతో రాయలసీమ వాసుల ఆకాంక్షలు పాక్షికంగా నెరవేరాయి. ఇక పెండింగ్ ప్రాజెక్టుల పనులు మొదలుపెడితే చాలు. వాస్తవంలో బనకచర్ల అనుసంధాన పథకం నిర్మాణం కష్టతరమూ, అసాధ్యం కూడా. కూటమి ప్రభుత్వానికి ఈ టర్మ్ సన్నాహాలకు సరిపోతుంది. ముందుకు సాగినా టెండర్లు పిలవగలరు. తీవ్ర అభ్యంతరాల మధ్య అనుమతులు పొందటం అంత సులభం కాదు. 2029 తర్వాత కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ అయిదేళ్లలో కూడా నిర్మాణం పూర్తి కాదు. దీనికి పోలవరం ఓ ఉదాహరణ. పైగా టన్నెల్స్ తవ్వడం బహు క్లిష్టమైనది. వెలుగొండ, గాలేరు%-%నగరి ప్రాజెక్టులకు ఫాల్ట్‌జోన్లు ఏర్పడి ఏళ్లూ పూళ్లూ గడిచిన అనుభవముంది. పైగా అంతర్రాష్ట్ర జల వివాదాలు జటిలంగా తయారయ్యాయి. దీనికి తోడు వరద జలాల ఆధారంగా డీపీఆర్ ఆమోదం వీటన్నింటికీ మించి క్లిష్టమైనది. తెలంగాణలోని అధికార, ప్రతిపక్షాల అభ్యంతరాల కన్నా ప్రజల భావోద్వేగాలకు జడిసి కేంద్ర ప్రభుత్వం తటస్థంగా ఉండిపోయింది. కేంద్ర పర్యావరణ శాఖ, గోదావరి %-%కృష్ణా యాజమాన్య బోర్డులతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీల చేత అడ్డంగా రాయించి కేంద్ర జల సంఘం చేతులు దులుపుకున్నది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎట్టకేలకు సరైన నిర్ణయం తీసుకున్నది. అయితే ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన 'పోలవరం, నల్లమల సాగర్'కు బాలారిష్టాలు లేకపోలేదు. ముందుగా వరద జలాలు ఆధారం అనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి. దేశంలో ఇంతవరకు వరద జలాల ఆధారంగా ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం ఆమోదించలేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉన్నప్పటికీ, ఏపీకి అనుకూలంగా ఏదైనా ఆమోదం ఇస్తే %-% అది దేశవ్యాప్తంగా ఒక సంప్రదాయంగా మారిపోయే అవకాశముంది. అందుకే కేంద్ర జల సంఘం అలాంటి నిర్ణయం తీసుకోవడానికి సాహసించకపోవచ్చు. పైగా ట్రిబ్యునల్ అవార్డు మేరకు గోదావరి వరద జలాలకు బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకూ హక్కు ఉంది. పోలవరం, నల్లమల సాగర్ అనుసంధానం వరద జలాల ఆధారంగా డీపీఆర్ ఆమోదించిన వెంటనే తెలంగాణ, మహారాష్ట్ర రెండూ (ఈ పాటికే కోరి ఉన్నందున) వరదజలాల ఆధారంగా తమ డీపీఆర్‌లు సమర్పిస్తాయి. ఈ విషయం కేంద్ర జలసంఘం పరిగణనలోకి విధిగా తీసుకుంటుంది. బనకచర్ల అనుసంధానం విషయంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేవనెత్తిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం చాలా తేలిగ్గా తీసుకుంటున్నది. ఇది కూడా సులభంగా అధిగమించలేనిదే! ప్రస్తుతం నిర్మాణంలోని పోలవరం తొలిదశ ఆధారంగా పోలవరం నల్లమల సాగర్‌కు అయినా నీళ్లు వచ్చే అవకాశం లేదు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్లు ఎత్తు నిర్మాణం జరిగి, పూర్తిస్థాయిలో నీళ్లు నిలిపినపుడు మాత్రమే సాధ్యం. పోలవరం హెడ్‌వర్క్స్ పూర్తి చేయవచ్చు గానీ, పూర్తిస్థాయిలో నీళ్లు నింపేందుకు నిర్వాసితుల తరలింపు ఎన్ని సంవత్సరాలు పడుతుందో! ఇవన్నీ అటుంచి పోలవరం రిజర్వాయర్ నుంచి గోదావరి వరద జలాలను తరలించడం సాధ్యం కాదు. అలా చేయాలంటే పోలవరం ఆపరేషన్ షెడ్యూల్ మార్పు చేయవలసి ఉందని. అంటే తిరిగి డీపీఆర్ ఆమోదం పొందాలని స్పష్టం చేసింది. 'పోలవరం, నల్లమల సాగర్ పథకం' పోలవరం ప్రాజెక్టులో భాగమైనపుడే అది సాధ్యం. పోలవరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 194 టీఎంసీలు అయినా, మనం అధికారయుతంగా ఉపయోగించుకునే పరిధి ఇంకా ఎక్కువ ఉంటుంది. ఆ నీటి నుంచి నల్లమల సాగర్ అనుసంధానం ప్రాతిపదిక చేసుకొంటే ఎవరి వైపు నుంచీ అభ్యంతరాలు ఉండవు. కేంద్ర జలసంఘం సులభంగా డీపీఆర్ ఆమోదిస్తుంది. బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా మరో చిక్కుముడి ఉంది. పోలవరం నుంచి తరలించే జలాలు కృష్ణానదిలో కలపకూడదు. కృష్ణా వద్ద ఏ పాయింట్‌కు తెచ్చినా, ఆక్విడెక్ట్ (నీటి మార్గ వంతెన) నిర్మించి నదిని దాటించాల్సి ఉంటుంది. ఒకవేళ 80టీఎంసీలకు మించితే కృష్ణా నికర జలాలను ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. దీన్ని గోదావరి ట్రిబ్యునల్ తన తీర్పులో స్పష్టంగా పొందుపర్చింది. గోదావరి ట్రిబ్యునల్ అవార్డుతో పాటు ఇంతవరకు కేంద్ర జలసంఘం పాటిస్తున్న నియమ నిబంధనలు పోలవరం, నల్లమల సాగర్ అంశంలో పాటించకపోతే బనకచర్ల అనుసంధానానికి ఎదురైన ఇబ్బందులు ఇక్కడా తప్పవు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరికోసం ఉద్దేశించి బనకచర్ల అనుసంధానంపై ఇంత హడావుడి చేశారో, ఆ ప్రాంతమైన రాయలసీమలోనే ఆ ప్రాజెక్టుపై సానుకూలత లేదు. 'మన ఇంటి ముంగిట పోయే కృష్ణానది నీళ్లు ఇవ్వకుండా, గోదావరి జలాలు ఎందుకు' అనే తీవ్ర మథనం ఉండేది. ఒక విధంగా వారి మనోభావాలను కూటమి ప్రభుత్వం మన్నించినట్లే భావించాలి. గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు ఇచ్చి, మిగిలిన నీళ్లు తమకు కృష్ణా ద్వారా ఇవ్వాలనేది రాయలసీమ వాసుల కోర్కె. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ముందుకు సాగుతోంది. కనీసం అయిదారు మాసాల్లో ట్రిబ్యునల్ తీర్పు వస్తుంది. ఆ తీర్పు తర్వాత బొల్లాపల్లి వరకు వచ్చే గోదావరి జలాలు డెల్టాకు, సాగర్ కుడికాలువ ఆయకట్టుకు ఇచ్చి, మిగిలే నీళ్లు రాయలసీమకు భేషుగ్గా ఇవ్వవచ్చు. ఈలోపు రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వాటికి పంట కాలువల నిర్మాణం పూర్తిచేయడం సముచితమైన చర్యగా వుంటుంది.

# భగవాన్ సత్యసాయిబాబా సేవామార్గానికి ప్రతిరూపం: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

- పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియంలో శతజయంతి వేడుకలు ఘనంగా
- "మానవసేవే మాధవసేవ" - బాబా బోధనలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం
- పేదలకు వైద్యం, తాగునీటి సేవలు చిరస్థాయిగా నిలిచాయని ఉపరాష్ట్రపతి ప్రసంశ




**పుట్టపర్తి, 23 నవంబర్ :** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవామార్గానికి ప్రతిరూపంగా నిలిచారని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. పేదలకు నిస్వార్థ సేవలు అందించి, మానవతా విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడిగా బాబాను ఆయన కొనియాడారు. శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన సభలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. తన ప్రేమను, సేవాసిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా పంచిన బాబా లక్షలమందికి సేవామార్గం చూపించారని గుర్తుచేశారు. సత్యసాయి ట్రస్ట్ ద్వారా అనేక ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు కల్పించడం, తమిళనాడులో ప్రజల దాహార్తి తీర్చడంలో చేసిన సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పేదల కోసం వైద్యాలయాలు నిర్మించి ఉచిత వైద్యం అందించడం బాబా కరుణారసతత్వానికి నిదర్శనమని అన్నారు. దేశ, విదేశాల్లో సత్యసాయి సిద్ధాంతాలు అమలుకావడం ఆయన ప్రభావ విస్తృతిని తెలియజేస్తోందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పుట్టపర్తి పుణ్యభూమి లక్ష్యంతోనే బాబా అవతరించారని, ఆయన సేవాభావం, క్రమశిక్షణ, ప్రేమ బోధనలు కోట్ల మందిని ప్రభావితం చేశాయని తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి తదితర ప్రముఖులు కూడా సభలో ప్రసంగించారు.

# వికసితా భారత్ లక్ష్యానికి సివిల్ సర్వెంట్లు కీలకం

- కొత్త సాంకేతికతలు, నిరంతర అధ్యయనం అనివార్యం
- జట్టు పని, అంతిమ దశ సేవల అందుబాటు పై ప్రత్యేక హితవు - పాలసముద్రం %చీూజX చీ%లో ఉపరాష్ట్రపతి సందేశం



**తొవ్వ డెస్క్, 23 నవంబర్ :** ఆంధ్రప్రదేశ్‌లోని పాలసముద్రంలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ లో సివిల్ సర్వీసెస్ శిక్షణార్థులతో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మేళవించారు. 2024లో ప్రధాని ప్రారంభించిన ఈ కొత్త క్యాంపస్ ఇప్పుడు కస్టమ్స్, జీఎస్టీ పరిపాలనలో దేశంలోనే అగ్రగామి శిక్షణ కేంద్రంగా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు. విక్సిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో సివిల్ సర్వెంట్లు ముఖ్య భూమిక పోషించాల్సి ఉంటుందని ఉపరాష్ట్రపతి సూచించారు. అంతిమ దశ సేవల అందుబాటు, జట్టు పని, సమగ్ర వృద్ధి వంటి అంశాలను అవలంబించడం అవసరమని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రావీణ్యంపై కాకుండా జట్టు ప్రదర్శనను ప్రాముఖ్యంగా తీసుకోవాలని శిక్షణార్థులకు ఆయన సూచించారు. కృత్రిమ మేధస్సు, సహజ భాషా ప్రక్రియ, మెషీన్ లెర్నింగ్, బ్లాక్‌చెయిన్ వంటి కొత్త సాంకేతికతలను స్వీకరించడంలో సివిల్ సర్వెంట్లు ముందుండాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఈ సాంకేతికతలు పారదర్శకత, సామర్థ్యం, ప్రజాసేవల మెరుగుదలకు కొత్త అవకాశాలు తెరవనున్నాయని చెప్పారు. కర్మయోగి మాడ్యూల్‌ను ఎక్కడైనా, ఎప్పుడైనా సామర్థ్య వృద్ధికి ఉపయోగపడే అద్భుత వేదికగా అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హృద, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, శాఖల మంత్రి నారా లోకేష్, ఉపరాష్ట్రపతి కార్యదర్శి అమిత్ ఖరే, డైరెక్టర్ జనరల్ సుబ్రహ్మణ్యం తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# భారత్-చైనా సరిహద్దులో తీవ్ర ఉద్రిక్తత

- భారత సైన్యం అత్యంత అప్రమత్తం
- లడఖ్ వ్యూహాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాల మోహరింపు
- కేంద్రం నుండి నిరంతర పర్యవేక్షణ, అత్యవసర సమీక్షలు కొనసాగింపు



డెస్క్, 23 నవంబర్ 2025: భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితి వేగంగా మారుతున్న నేపథ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ ఎక్కువయ్యాయి. లా సి వెంబడి చైనా సైనికుల చలనం ఒక్కసారిగా పెరగడంతో భారత భద్రతా వ్యవస్థ పూర్తి అప్రమత్త స్థితిలోకి వెళ్లింది. ముఖ్యంగా లడఖ్‌లోని పలు ప్రధాన పర్వత శ్రేణుల వద్ద చైనా సైనిక వాహనాల రవాణా పెరగడం ఆందోళనకు కారణమైంది. దృశ్యమాన సంకేతాల ప్రకారం చైనా వైపు నుండి గస్తీ చర్యలు, పర్వత మార్గాల్లో చేసే కదలికలు సాధారణ స్థాయిని మించి ఉన్నట్లు సరిహద్దు భద్రతా వర్గాలు గుర్తించాయి. ఈ పరిణామాల నడుమ భారత సైన్యం వెంటనే అదనపు బలగాలను అక్కడికి తరలించింది. పగలు%-%రాత్రి భేదం లేకుండా నిఘా కొనసాగుతోంది. పర్వత మార్గాలపై స్థిర కెమెరాలు, దూరదర్శక వ్యవస్థలు, శక్తివంతమైన రాత్రి నిగ్రహ పరికరాలతో పరిస్థితిని ప్రతి క్షణం పరిశీలిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎప్పుడైనా మార్పులు సంభవించే అవకాశం ఉండటంతో, స్థానిక శిబిరాలన్నీ అప్రమత్త స్థితి లోకి మార్చబడ్డాయి. సైన్యంతో పాటు సరిహద్దు రక్షణ దళాలు కూడా సంయుక్త గస్తీని మరింత బలపరిచాయి. భారత్ వైపు ఉన్న ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని అత్యంత సీరియస్‌గా తీసుకుని క్రమం తప్పని సమీక్షలు చేస్తున్నారు. ఇటీవల చైనా పర్వత ప్రాంతాల్లో చేస్తున్న నిర్మాణ కార్యకలాపాలు, కొత్త శిబిరాల ఏర్పాట్లు, పరికరాల రవాణా వంటి అంశాలు కచ్చితమైన పరిశీలనలో ఉన్నాయని సమాచారం. చైనా వైపు నుండి ఇచ్చే రాజకీయ సందేశాలు మరియు సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన కదలికలు ఒకదానికొకటి విరుద్ధంగా ఉండటంతో, భారత్ అప్రమత్తతను మరింత పెంచినట్లు రక్షణ వర్గాలు చెబుతున్నాయి. ఏ ప్రాంతంలోనైనా చొరబాటు ప్రయత్నం జరిగితే వెంటనే ప్రతిస్పందించేందుకు ప్రత్యేక దళాలు సిద్ధంగా ఉంచబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం మొత్తం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. సరిహద్దు శాంతి, స్థిరత్వం, సంభాషణల మార్గం వంటి అంశాలపై భారత్ ఎప్పటికీ తన కట్టుబాటును కొనసాగిస్తున్నప్పటికీ, దేశ భద్రత విషయంలో రాజీ ఉండదనే స్పష్టమైన సంకేతం ఇచ్చింది. పరిస్థితి ఏ దిశలోనైనా మారినా, తక్షణ చర్యలు తీసుకునే సామర్థ్యం భారత సైన్యం వద్ద పూర్తిగా సిద్ధంగా ఉందని అధికారులు తెలియజేశారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే స్థానిక ప్రజల భద్రత కోసం ప్రత్యేక సూచనలు జారీ చేసి, కీలక ప్రాంతాల్లో కదలికలను పరిమితం చేసే చర్యలు చేపట్టారు.

# అడవి జంతువుల సంఖ్య ఆందోళనకరం

### జీవవైవిధ్య సంక్షోభంలో మానవ తప్పిదమే కారణమా?



భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా అడవుల్లో జంతువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం పర్యావరణవేత్తలలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామం కేవలం జీవవైవిధ్యానికి ముప్పు మాత్రమే కాక, మొత్తం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే పెను సంక్షోభంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన్యప్రాణుల క్షీణతకు ప్రధాన కారణం 'ఆవాసాల విధ్వంసం' అని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. నివాస అవసరాలు, విస్తృత వ్యవసాయం, మైనింగ్, భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం అడవుల నరికివేత విపరీతంగా పెరిగింది. పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ కోసం అడవులను చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టడం జరుగుతోంది. దీనిని 'ఆవాసాల విచ్ఛిన్నం' అంటారు. దీనివల్ల జంతువులు ఆహారం, సంతానోత్పత్తికి తగినంత స్థలం లేక అంతరించిపోయే దశకు చేరుతున్నాయి, మరోవైపు, అక్రమ వేట, వన్యప్రాణుల అక్రమ రవాణా ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. పులి చర్మం, ఏనుగు దంతాలు వంటి విలువైన వస్తువుల కోసం జరుగుతున్న వేట పలు అరుదైన జాతులను పూర్తిగా తుడిచిపెడుతోంది. ఇక, అనూహ్యంగా మారుతున్న వాతావరణం కూడా జంతువులకు తీవ్ర సవాలుగా మారింది. అకాల వర్షాలు, దీర్ఘకాలిక కరువులు, ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా అనేక జాతులు వాటికి అనువైన వాతావరణాన్ని కోల్పోతున్నాయి. ఉదాహరణకు, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల పగడపు దిబ్బలు నాశనమై, వాటిపై ఆధారపడిన జీవరాశులు అంతరించిపోతున్నాయి. ఆవాసాలు తగ్గిపోవడంతో, అడవి జంతువులు ఆహారం కోసం తరచుగా పంట పొలాలు, మానవ నివాస ప్రాంతాలపైకి వస్తున్నాయి. దీని ఫలితంగా పెరిగిన అమాయక జంతువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. మన్య మృగాల సంఖ్య తగ్గడం వల్ల పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్య శ్వాసకోశాలు

మీరు ఆ ప్రసంగాన్ని వింటే ఆ మాటలు బాల్‌గంగాధర్ తిలక్‌వో, జవహర్‌లాల్ నెహ్రూవో, జయ ప్రకాశ్ నారాయణ్‌వో లేదా నెల్సన్ మండేలావో అయివుండొచ్చని భావిస్తారు. అయితే మీరు పొరపడ్డారు. ఆ వక్త సాక్షాత్తు గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఆ ప్రసంగం విలేఖర్లకు వీనుల విందుగా ఉంటుందేమో?! గత పదకొండు సంవత్సరాలుగా విలేఖర్ల సమావేశంలో పాల్గొనేలా ప్రధానమంత్రిని అంగీకరింప చేసేందుకు వారు చేయని ప్రయత్నం లేదు కదా. విఫల మనోరథులు అయిన పాత్రికేయులు ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెలువరించిన ఆ ప్రసంగాన్ని విని సహజంగానే ఆనందభరితుల యివుంటారు. ప్రత్యక్ష ప్రసారమయ్యే పత్రికా గోష్ఠిలో విలేఖర్లు అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వకూడదన్న తన దృఢ సంకల్పాన్ని ప్రధానమంత్రి ఎట్టకేలకు సడలించుకున్నారేమోనన్న ఆశాభావం సైతం వారి మనస్సుల్లో తటిల్లమని ఉంటుంది. తాము ఇక నిరంతరం జాగ్రత్తగా ఉండవలసిన అవసరం లేదని, తమ అభిప్రాయాలను 'ఒక వైపు' లేదా 'మరో వైపు' అనే పదబంధాలతో వివరిస్తూ సమతుల్య సంపాదకీయాలు రాయవచ్చనే భరోసాను సంపాదకీయ రచయితలకు ప్రధానమంత్రి ప్రసంగం కలిగిస్తున్నది. ఆయన మాటలు వ్యంగ్య చిత్రకారులకు కూడా ఎనలేని ఉత్సాహాన్ని కలిగిస్తాయి. 'ఎవరినీ వదలవద్దు, ప్రధాన మంత్రిని సైతం విడిచి పెట్టవద్దు' అన్న వివేకవంతమైన మాటలను గుర్తు చేసుకుంటూ కార్టూనిస్టులు తమ పెన్సిళ్లకు పదునుపెడతారు. అవి జాలువార్చిన గీతలు, వ్యాఖ్యలు ప్రజలు తమ పాలకుల అవివేకానికి, అధికార ఔద్ధత్యానికి పగలబడి నవ్వుకునేలా చేస్తాయి. 'పాఠక మహాశయా, నన్ను క్షమించు నేను ఏమి చేస్తున్నానో నాకు తెలుసు' అన్న ప్రార్థనతో సమాజ యథార్థాలను ఎత్తిచూపిన వార్తలు, వార్తా వ్యాఖ్యలు అనేకాన్ని చెత్తబుట్ట పాలు జేసిన ఎడిటర్లకు ఆ మాటలు తమ అసలు విధ్యుక్త ధర్మ నిర్వహణకు ప్రోత్సాహకరమైన పిలుపు అవుతాయి. నరేంద్ర మోదీ మాటలు నిజంగా చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి, సందేహం లేదు. రామ్‌నాథ్ గోయెంకా (1904-1991) ఔదలదాల్చిన ఆదర్శం సాహసోపేత పాత్రికేయం ఆ ఆదర్శమే ఆయన నెలకొల్పిన వార్తపత్రికకు మార్గదర్శక ధర్మసూత్రమయింది. ప్రతి రోజూ ఆ పత్రిక మాస్ట్ హెడ్‌లో భాగంగా ఉంటోంది. రామ్‌నాథ్ గోయెంకాను కొనియాడుతూ ప్రధాన మంత్రి ఇలా ఉద్ఘాటించారు: 'రామ్‌నాథ్ గోయెంకా బ్రిటిష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దృఢవైఖరితో వ్యవహరించారు. బ్రిటిష్ వారి ఆదేశాలను పాటించడం కంటే తన పత్రికను మూసివేసేందుకే ప్రాధాన్యమిస్తానని ఆయన ఒక సంపాదకీయంలో స్పష్టం చేశారు. అదే విధంగా, మన దేశాన్ని ఎమర్జెన్సీ రూపంలో దేశాన్ని బానిసత్వ అంధకారంలోకి నెట్టివేసినప్పుడు కూడా రామ్‌నాథ్ గోయెంకా నాటి పాలకులపై రాజీ లేని పోరాటం చేశారు. ఎమర్జెన్సీ విధించి యాభై సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ ఏడాది జూన్‌లో దేశ ప్రజలు అందరూ ఆ చీకటి రోజులు గుర్తు చేసుకున్నారు'. బాగా చెప్పారు. అయితే నేటి పత్రికా రంగంలో ఉన్న వాస్తవ పరిస్థితులు ఏమిటి? భారతదేశ ప్రముఖ వార్తా పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రభవించినవే. ఆ మహోన్నత పోరాట లక్ష్యాలు, ఆదర్శాలతో స్ఫూర్తి పొందినవే. పత్రికారంగం పరిస్థితులకు అద్దం పట్టే గోది మీడియా (ప్రభుత్వ పక్షపాతంతో వ్యవహరించే పత్రికలు, ఛానెల్స్) అనే పదాన్ని సృష్టించవలసిన అవసరం 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశం కల్పిస్తుందని నాటి త్యాగధనుల తరం ఊహించి ఉండదు. అసంఖ్యాక పాఠకులు, వీక్షకులు చదవడానికి, చూడడానికి తిరస్కరిస్తున్నప్పటికీ అనేక వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ ప్రభుత్వ అండదండల పుణ్యమా అని ఇంకా పచ్చగా వర్ధిల్లుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు: 'రామ్‌నాథ్ గోయెంకా సదా సత్యం పక్షాన నిలబడ్డారు. తనను వ్యతిరేకిస్తున్నవారు ఎంత శక్తిమంతులు అయినప్పటికీ తన విధ్యుక్త ధర్మ నిర్వహణకే ఆయన అధిక ప్రాధాన్యమిచ్చారు'. పత్రికా వార్తలు ఒకప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి దోహదం చేసేవిగా ఉండేవి. ఇప్పుడు భిన్నమైన వార్తలు పత్రికల గురించి వినవస్తున్నాయి. ఉదాహరణకు ఒక ఎడిటర్ గురించి వినవచ్చిన వార్తను చూడండి: తాను పనిచేస్తున్న పత్రిక యాజమాన్యంతో ఆయన కుదుర్చుకున్న కాంట్రాక్టు ముగిసేందుకు ఇంకా చాలా కాలం ఉంది. అయితే ఒక రోజున ఉన్న పాటుగా ఆయనకు మిగతా కాంట్రాక్టు కాలపు వేతన భత్యాల మొత్తానికి సంబంధించిన చెక్ అందింది. అదే రోజు సాయంత్రానికి బాధ్యతలను కొత్త ఎడిటర్‌కు అప్పగించి ఇంటికి వెళ్లిపోవాలని యాజమాన్యం నుంచి ఆదేశమూ జారీ అయింది. ఒక టీవీ యాంకర్‌కు విశేష వీక్షకాదరణ ఉన్నది. ఆయన పనిచేస్తున్న టీవీ ఛానెల్ యాజమాన్యం మారింది, ఆ యాంకర్‌ను ఆ సంస్థ నుంచి పంపించివేశారు. ఈ ఉదంతాన్ని అర్ధరాత్రి తిరుగుబాటుగా మీడియా వర్గాలలో చెప్పుకున్నారు. ఇంకా ఎంతోమంది ప్రముఖ పాత్రికేయులకు అంతకంటే దిగ్భ్రాంతికరమైన అనుభవాలు ఎదురయ్యాయి. గత పది సంవత్సరాలలో ప్రఖ్యాత పాత్రికేయులు ఎందరో తమ ఉద్యోగాన్ని కోల్పోయారు. ఇప్పటికీ వారిలో చాలామంది ఉద్యోగాన్వేషణలోనే ఉన్నారు! కొద్ది రోజుల క్రితం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన ఒక సమావేశం గురించి యశ్వంత్ సిన్హా ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. ప్రెస్ క్లబ్ ఆహ్వానంపై సిన్హా అక్కడకు వెళ్లి ఒక ప్రసంగాన్ని వెలువరించారు. ప్రసంగం అనంతరం పాత్రికేయులతో ఆయన పిచ్చా పాటీ చేశారు. ఆ సందర్భంగా ఆయన తాను అప్పుడప్పుడు చేస్తున్న ప్రకటనల గురించి ఎలాంటి వార్తలు రావడం లేదని మృదువుగా మందలించారు. ఆయన మాటతో ప్రతి ఒక్కరూ మౌనం వహించారు. చివరకు ఒక యువ పాత్రికేయుడు ఇలా అన్నాడు: 'యశ్వంత్ సిన్హా గారూ, మీ ప్రకటనలపై నేను వార్తలు రాస్తాను. నేను గనుక ఉద్యోగాన్ని కోల్పోతే, నాకు మరెక్కడైనా ఒక ఉద్యోగాన్ని ఇప్పించగలరా?'. యశ్వంత్ సిన్హా దిగ్భ్రాంతి చెందారు.. తేరుకొని మెల్లగా ఆ పాత్రికేయుడుతో ఇలా అన్నారు: 'మీరు మీ ఉద్యోగాన్ని కాపాడుకోండి'. నేను ఒక సాయంత్రం ఒక చిన్న రెస్టారెంట్‌కు పాత్రికేయ మిత్రుడు ఒకరితో కలిసి డిన్నర్‌కు వెళ్లాను. మేము విందులో ఉండగా రాత్రి పదిగంటల సమయంలో ఆ పాత్రికేయుడికి అతని కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వచ్చింది.

# మీ కష్టం నాకు తెలుసు

**నేనూ రైతు బిడ్డనే.. మీకు అండగా ఉంటా.. అన్నదాతలకు చంద్రబాబు లేఖ**

**నేటి నుంచి 'రైతన్నా.. మీ కోసం'**

**లాభసాటి సాగుకు పంచసూత్రాలపై అవగాహన**

**అన్నదాతల ఇళ్లకు తరలిరానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు**

**ఆర్థిక సాధానికి మూల స్తంభం వ్యవసాయమే**

**పంటల మార్పిడి పాటించాలి**


**చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి**

**ప్రకృతి వ్యవసాయం అవలంబించాలి**

**ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు మరింత విలువ**

**13 వేల కోట్లతో 38 పరిశ్రమలకు ఎంవోయూలు**

**టెక్నాలజీ తోడైతే రైతుకు తిరుగుండదు: సీఎం**



**అమరావతి, నవంబరు 23:** పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం సోమవారం నుంచి చేపడుతోంది. వారం రోజులు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అన్నదాతల ఇళ్లకే రానున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి రాసిన లేఖను కరపత్రం రూపంలో అందించనున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి అందిస్తున్న.. ఇకపై చేపట్టనున్న చర్యలను ఆయన అందులో ప్రస్తావించారు. కొత్త ఆలోచనలు పంచుకుంటూ, మార్పునకు నాంది పలకడానికి ప్రభుత్వానికి అన్నదాతలందరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తానూ పాల్గొంటానని సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. సంక్షిప్తంగా ఆయన లేఖ సారాంశమిదీ.. నేనూ రైతు బిడ్డనే.. రాష్ట్రంలోని ప్రతి కర్షకుడి కష్టం నాకు తెలుసు. మీతో కలిసి నడవడానికి, మీ సమస్యలను పరిష్కరించడానికి, మీకు పూర్తి అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నా. రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూల స్తంభం.. వ్యవసాయ రంగమే. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలు రాష్ట్ర జీఎస్‌డీపీలో 35శాతం వరకు వాటా అందిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. 2047 నాటికి ప్రజల తలసరి ఆదాయం రూ.55 లక్షలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటున ఏడాదికి 15% వృద్ధి రేటు సాధించాలని నిర్దేశించుకున్నాం. రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు ఐదు విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా.. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.

**సాగు పద్ధతులు మారాలి..**

సమాజంలో నేడు మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలి. పంటల మార్పిడి పాటించాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి వాటికి మళ్లీ డిమాండ్ వచ్చింది. చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి. వాతావరణ మార్పులు తట్టుకునే పరిష్కార మార్గంగా ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున అవలంబించాలి. సాగుకు టెక్నాలజీ తోడైతే మన రైతులకు తిరుగుండదు. అందుకే అగ్రిటెక్‌ను ప్రోత్సహిస్తున్నాం. ప్రతి రైతుకు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ పథకంలో 'యూనిక్ ఐడీ'ల నమోదుతో పథకాలు వర్తింపజేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై.. గత ప్రభుత్వం రద్దుచేసిన 100శాతం సబ్సిడీని పునరుద్ధరించాం. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో పదెకరాలలోపు రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీ తగ్గిస్తే.. దాన్ని 90 శాతానికి పెంచాం. యంత్రాలు, టెక్నాలజీ వాడకంతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలు సరఫరా చేస్తున్నాం. కిసాన్ డ్రోన్ సేవలు అందిస్తోంది.

**అగ్రి ప్రెన్యూర్ రావాలి..**

రైతుల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలి. దీనికోసం రూ.13వేల కోట్ల పెట్టుబడితో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సీఐఐ సదస్సులో ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఎంటర్‌ప్రెన్యూర్‌లా.. అగ్రి ప్రెన్యూర్ రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం దానికి నాంది పలుకుతుంది. సీసీసీ అంటే.. కాఫీ, కోకో, కోకోనట్ వంటి పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుతో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం ఇస్తున్నాం.

**రైతు కుటుంబాలకు 6,310 కోట్లు..**

రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికీ రూ.14వేల వంతున 46,86,838 రైతు కుటుంబాలకు రూ.6,310 కోట్లు ఇచ్చాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఉపశమనంగా ప్రధాన పంటలకు రూ.8 వేలు (హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25 వేలకు) పెంచి ప్రత్యేక పరిహారాన్ని ప్రకటించాం. మార్కెట్ ధరలు తగ్గిన పరిస్థితుల్లో, రైతులను ఆదుకోవడానికి మద్దతు ధర, మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకాల ద్వారా వరి, కంది, మినుము, పెసర, శనగ, టమాటా, ఉల్లి, మామిడి, కోకో పంట ఉత్పత్తులను కొనుగోలు చేశాం. రైతులను ఆదుకోవడానికి మొదటిసారిగా పొగాకును కూడా కొనుగోలు చేశాం. 24-48 గంటల్లోనే సొమ్ము చెల్లించాం. ఉల్లి రైతులకు అండగా నిలిచేందుకు హెక్టారుకు రూ.50 వేలు సాయం ప్రకటించాం. మామిడి కిలోకి రూ.4, కోకో పంటకు రూ.50 అదనంగా చెల్లించాం. దీనివల్ల కోకో రైతులకు రూ.11.84 కోట్లు, మామిడి రైతులకు రూ.190 కోట్లు ప్రత్యక్ష లబ్ధి చేకూరింది.

**పాడికి ప్రోత్సాహం..**

పశుసంవర్ధక రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలపడానికి పాలు, మాంస ఉత్పత్తికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. గుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో కొనసాగుతున్నాం. మెరుగైన పౌల్ట్రీ పాలసీ(2025-30) తీసుకొస్తున్నాం. పాడి పరిశ్రమకు ఇతోధిక ప్రోత్సాహానికి గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, మెరుగైన వసతి గృహాలు(గోకులాలు), పశుగ్రాసం పెంపకం, పశు దాణా పంపిణీ, ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల టీకాలు అందిస్తాం. మాంసం ఉత్పత్తికి బ్రాయిలర్ కోళ్ల పెంపకం, దేశవాళీ కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం(ఎన్ఎంఎల్), మాంస ఉత్పత్తి, శుద్ధి కేంద్రాల స్థాపన, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సా హం ఇస్తున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. సూపర్‌సిక్స్ హామీల్లో ప్రతి హామీనీ అమల్లోకి తెచ్చాం. 17 నెలల కాలంలో సూపర్‌సిక్స్‌ను సూపర్‌హిట్ చేశాం. తల్లికి వందనం, స్త్రీశక్తి-ఉచిత బస్సు, దీపం-2, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, 20లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ అమలు చేశాం.

# కాళోజీ వర్సిటీలో అక్రమార్కులు

**- వైద్య విద్య పీజీ పరీక్షల్లో గోల్ మాల్ - ఫెయిలైన ఐదుగురికి మార్కులు కలిపిన వైనం**

**- పునః మూల్యాంకనమే లేనప్పుడు ఇదెలా సాధ్యం? - ఖాళీ పేజీల్లో మళ్లీ రాతలు రాసినట్టు అనుమానాలు**

**- వీళ్లందరూ ప్రైవేట్ మెడికల్ కళాశాలకు చెందిన వారే - రీకౌంటింగ్ తర్వాత మరో యూజీ విద్యార్థి కూడా పాస్**

**- పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు - సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య విద్యార్థుల డిమాండ్**

**హైదరాబాద్, నవంబరు 23:** సాధారణ విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే ఏం చేస్తారు?.. పాస్ అయ్యే దాకా కష్టపడి చదువుతారు... కానీ, భవిష్యత్తులో డాక్టర్లు కావాల్సిన ఐదుగురు విద్యార్థులు అడ్డదారి తొక్కారు. అక్రమంగా మార్కులు వేయించుకుని పాస్ అయ్యారు. ఈ తతంగం వెనుక కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలోని కొందరు అక్రమార్కుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత ఫెయిలై.. మళ్లీ పాస్ అయిన వారంతా ప్రైవేట్ మెడికల్ కాలేజీ విద్యార్థులు కావడం గమనార్హం. మరోవైపు.. ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ యూజీ విద్యార్థి ఫెయిలైనా... రీకౌంటింగ్‌లో పాస్ అయ్యాడు. రీకౌంటింగ్ తర్వాత ఓ విద్యార్థి పాస్ కావడం కాళోజీ యూనివర్సిటీ చరిత్రలోనే ఇదే తొలిసారి. వైద్య విద్య పీజీ పరీక్ష ఫలితాలు ఈనెల 4వ తేదీన వెలువడ్డాయి. ఓ ప్రైవేటు వైద్యవిద్య కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. కానీ, ఆ తర్వాత కొద్ది రోజులకే పాస్ అయ్యారు. ఇదెలా సాధ్యమైందని సహచర మెడికోలు ఆరా తీయగా... అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అండర్, పోస్టు గ్రాడ్యుయేట్ పరీక్షల్లో విద్యార్థులు జవాబులు రాసేందుకు 30 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. దానిపై విద్యార్థి హాల్ టికెట్ నంబరుతోపాటు క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. ఆ బుక్‌లెట్‌లో జవాబులన్నీ రాశాక... ఇంకా పేపర్లు మిగిలి ఉంటే... వాటిపై పెద్దగా కొట్టివేత ('ఎక్స్' గుర్తు) మార్క్ వేయాలి. అలా క్రాస్ మార్కింగ్ చేసిన తర్వాతే ఇన్విజిలేటర్లు ఆయా జవాబు పత్రాలను తీసుకుంటారు. ఆ తర్వాత వాటిని స్కాన్ చేసి.. జంబ్లింగ్ పద్ధతిలో వివిధ కాలేజీలకు పంపుతారు. సంబంధిత సబ్జెక్టుల అధ్యాపకులు.. వాటిని ఆన్‌లైన్‌లోనే మూల్యాంకనం చేస్తారు. ఇదంతా చాలా పకడ్బందీగా ఉంటుంది. చివరకు సదరు సాఫ్ట్‌వేరే.. ఒక్కో జవాబుకు వేసిన మార్కులన్నీ లెక్కించి మొత్తం మార్కులను వెల్లడిస్తుంది. అయితే, ఈ ఐదుగురు విద్యార్థుల జవాబు పత్రాల్లో కొట్టివేత మార్కు వేసిన పేజీల్లోనూ జవాబులు రాసి ఉన్నట్లు తెలిసింది. సాధారణంగా కొట్టివేత మార్కు వేసిన పేజీల్లో రాసిన జవాబులను పరిగణనలోకి తీసుకోరు. కానీ, ఆయా జవాబులకు మళ్లీ మార్కులు వేసి, పాస్ చేసినట్లు తెలుస్తోంది. ఇలా అక్రమంగా మార్కులు కలిపినందుకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి పీజీ పరీక్షలకు సంబంధించి రీవ్యాల్యుయేషన్ అనేదే లేదు.. కేవలం రీకౌంటింగ్ మాత్రమే ఉంది. అలాంటప్పుడు ఇదంతా ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, హైదరాబాద్ సమీపంలో ఉండే ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థి సైతం ఎంబీబీఎసలో ఫెయిల్‌కాగా, ఆ తర్వాత రీకౌంటింగ్‌లో పాస్ అయ్యాడు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం చరిత్రలోనే రీకౌంటింగ్‌లో ఓ విద్యార్థి పాస్ కావడం ఇదే తొలిసారి అని విద్యార్థులు చెబుతున్నారు. దీని వెనుక కూడా భారీ మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**వర్సిటీ లాగిన్ తనిఖీ చేస్తే...**

"విద్యార్థులు పాస్ అయినా... ఫెయిలైనా.. వారికి వచ్చిన మార్కులు వివరాలన్ని యూనివర్సిటీ అంతర్గత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. వాటిలో మార్పులు చేయాలంటే సంబంధిత లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు తెలిసిన వారే చేయగలరు. ఎన్నిసార్లు లాగిన్ అయ్యారు? ఎప్పుడెప్పుడు లాగిన్ అయ్యారు? ఏమేమి మార్పులు చేశారు? అన్న వివరాలు కూడా నమోదై ఉంటాయి.

## సత్యసాయి.. ప్రజల్లో దేవుడిని
# చూసిన మహానుభావుడు

**తెలంగాణలోనూ అధికారికంగా శతజయంతి ఉత్సవాలు**

**బాబా ట్రస్టు కార్యక్రమాలకు తోడ్పడతాం: సీఎం రేవంత్**

**నిస్వార్థ సేవలకు ప్రతిరూపం: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

**పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు**



**అనంతపురం/పుట్టపర్తి, నవంబరు 23:**

భగవాన్ సత్యసాయి ప్రజల్లోనే దేవుడిని చూశారని, ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనేది ఆయన సందేశమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాబా సందేశం యుగయుగాలపాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణలోనూ సాయిబాబా శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బాబా సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు, ఆయన సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేయడానికి తమ ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో రేవంత్ ప్రసంగించారు. "తన సేవలతో ప్రజలలో సత్యసాయి దేవుడయ్యారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించడం ద్వారా ట్రస్టు లక్షలాది మంది జీవితాలకు వెలుగునిచ్చింది. ప్రభుత్వాలకు సరితూగే స్థాయిలో, కొన్ని సందర్భాల్లో అంతకుమించి సేవలు అందిస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలు అందని ప్రాంతాల్లో బాబా ఆస్పత్రులు అనేక మందికి ప్రాణదానం చేస్తున్నాయి. తెలంగాణలోని పాలమూరు, ఏపీలో అనంతపురం జిల్లా లాంటి కరువు ప్రాంతాల్లో ప్రభుత్వాలు పరిష్కరించలేని తాగునీటి సమస్యను బాబా ట్రస్టు పరిష్కరించింది. అందుకే సత్యసాయి ప్రాణమిచ్చే దేవుడి స్థానాన్ని పొందారు" అని రేవంత్ పేర్కొన్నారు. శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవలకు భగవాన్ సత్యసాయిబాబా ప్రతిరూపమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆయన బోధనలు.. 'అందరినీ ప్రేమించు- అందరినీ సేవించు, ఎల్లప్పుడూ సాయపడు, ఎన్నటికీ బాధించకు' వంటివి విశ్వవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. 1964-65 మధ్య తన కుటుంబానికి సత్యసాయి ఆశీస్సులు అందాయని.. తమిళం మాత్రమే తెలిసిన తన అత్తయ్య ఒంటరిగా పుట్టపర్తికి వచ్చి, 15 రోజులు ఇక్కడ ఉండి బాబా ఆశీస్సుల అందుకోవడం దైవిక శక్తికి నిదర్శనమని గుర్తు చేసుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు దేశవ్యాప్తంగా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. సంఘర్షణలు, ఒత్తిళ్లతో నిండిన నేటి ప్రపంచానికి ఆయన బోధించిన ప్రేమ, ఐక్యత, సేవ వంటి విలువలు మరింత అవసరమన్నారు. కాగా, మానవ విలువల వికాసానికి సత్యసాయి అందించిన సేవలు అపూర్వమని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి కొనియాడారు. మానవత్వం, దైవత్వం మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు సత్యసాయి ట్రస్టును ఏర్పాటు చేయడం బాబా తీసుకున్న దైవ నిర్ణయమని చెప్పారు. ఆయన శత జయంత్యుత్సవాలు భావి తరాలకు సేవామార్గంలో పునఃసమర్పణగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజలకు జ్ఞానాన్ని బోధించి, సన్మార్గం చూపే లక్ష్యంతో అవతరించిన మహోన్నతుడు సత్యసాయిబాబా అని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. "సమాజ సేవ, సమస్యకు పరిష్కారం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తి మార్గంతో కోట్ల మంది జీవితాలను బాబా ప్రభావితం చేశారు. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంక్షేమాన్ని ఆయన కోరుకున్నారు. భగవాన్ మనో దర్శనం ద్వారా దేశ, విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులు వచ్చి ఆయన సేవా మార్గాన్ని అనుసరించారు. ఎక్కడా లేని ప్రశాంతతను పుట్టపర్తిలో పొందారు" అని పేర్కొన్నారు. ఇక ప్రేమ, అహింస, సత్యం, ధర్మం, శాంతి ప్రతి మనిషి జీవిత పరమార్థమని సత్యసాయి బోధించారని.. భగవాన్ శతజయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని మంత్రి లోకేశ్ చెప్పారు.

**సర్వం.. సాయి స్మరణ**

పుట్టపర్తి: 'సత్యమే యథార్థం. అదే నా తత్వం. నాపేరు కూడా సత్యం. నా ప్రచారమే సత్యం. నేనే సత్యం..' అని ప్రకటించుకున్న పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు, ప్రముఖులు తరలివచ్చారు. వేడుకలలో చివరి రోజు, సత్యసాయి జయంతి అయిన ఆదివారం పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియం ఉదయం ఏడు గంటలకే భక్తజనంతో నిండిపోయింది. నిర్మల, నిస్వార్థ సేవ, ప్రేమను పంచిన సత్యసాయికి జయము జయము అని భక్తులు స్మరించుకున్నారు. శాంతి వేదిక వద్దకు చేరుకున్న స్వర్ణ రథానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మంగళహారతి ఇచ్చారు. అనంతరం వేదికపై సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆర్‌జే రత్నాకర్ అతిథులకు స్వాగతం పలికారు. శత జయంతి వేడుకలలో రెండు రోజులపాటు పాల్గొన్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సత్కరించారు. భగవాన్ సత్యసాయి బాబా ప్రారంభించిన సత్యసాయి మిషన్‌కు భక్తులే మూలస్తంభాలు అని అన్నారు. వేడుకలకు హాజరైన ఉప రాష్ట్రపతి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా వీవీఐపీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



## డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదు

'సినిమా అనేది ప్రజల సమస్యలను పెంచకూడదు. వినోదాన్ని మాత్రమే పంచాలి.' అంటున్నారు బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి. ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో ఆమె నేటి సినిమాల గురించి ఆసక్తికరంగా మాట్లాడారు. 'స్క్రిప్ట్ ఎంచుకునే విషయంలో నేను కొన్ని విలువలకు కట్టుబడి ఉంటా. సినిమా ప్రజల్లో ద్వేషాన్ని పెంచేలా ఉండకూడదని భావిస్తాను. కథల ఎంపికల విషయంలో డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదు. నా ఎంపికలన్నీ విలువలతో కూడుకున్నవే.' అని తెలిపారామె. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్, మహారాణి, హీరా మండి చిత్రాల్లో ప్రయోగాత్మక పాత్రలతో మెప్పించిన హ్యూమా.. రీసెంట్‌గా రిలీజైన 'ఢిల్లీ క్రైమ్' వెబ్‌సిరీస్ సీజన్ 3లో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం ఆమె నిర్మాతగానూ కొనసాగుతున్నది.

# ఆదా శర్మ ఇంట తీవ్ర విషాదం..



హార్ట్ అటాక్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించిన ఆదాశర్మ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆమె అమ్మమ్మ తులసి సుందర్ కొచ్చ అనారోగ్యంతో బాధపడుతూ నెలరోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆదివారం (నవంబర్ 23) పరిస్థితి విషమించడంతో ఈ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనతో ఆదా శర్మ కుటుంబంలో శోకసంద్రం నెలకొంది. ఈ ఏడాది ప్రారంభంలో అమ్మమ్మ పుట్టినరోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసిన ఆదా, సోషల్ మీడియాలో ఇద్దరు కలిసి ఉన్న అందమైన వీడియోను షేర్ చేసి అభిమానులను ఆకట్టుకుంది. అయితే కొద్ది నెలల్లోనే ఈ విషాదం సంభవించడంతో ఆమె ఫ్యామిలీ దుఃఖ సాగరంలో మునిగిపోయింది. తులసి సుందర్ మృతికి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు సంతాపం తెలియజేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని పోస్టులు పెడుతున్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'హార్ట్ అటాక్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆదా శర్మ తరువాత క్షణం, గరం, కల్కి, సన్నాఫ్ సత్యమూర్తి, సుబ్రమణ్యం ఫర్ సేల్ వంటి చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంది. హీరోయిన్‌గా, సెకండ్ హీరోయిన్‌గా, సహాయ నటి పాత్రల్లోనూ తనదైన నటనతో ఆకట్టుకుంది. హిందీలో 'ది కేరళ స్టోరీ'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె, 'బస్తర్: ది నక్సల్ స్టోరీ'తో పాన్ ఇండియా స్థాయిలో మరింత ఫేమ్ సంపాదించింది. ఈ సినిమాలతో పాటు వరుసగా వివాదాల్లో నిలుస్తూ వార్తల్లో నిలిచిన ఆదా శర్మ, ఇటీవల విక్రమ్ భట్ దర్శకత్వంలో వచ్చిన 'తుమ్సే మేరి కసమ్'లో చివరిసారిగా కనిపించింది. అనుపమ్ ఖేర్, ఇష్వాక్ సింగ్, ఈషా డియోల్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఆదాకి సరికొత్త అనుభవాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఉండగా, ఈ ఆకస్మాత్తు విషాదం ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేసింది.



# చనువుతోనే ఎర్రబెల్లిని సరదాగా తోసేశా..

### వీడియో వివాదంపై బ్రహ్మానందం



టాలీవుడ్ యాక్టర్ మోహన్ బాబు సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఈవెంట్ ఏర్పాటు చేశారు. ఈవెంట్‌కు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈవెంట్‌కు హాజరైన వారిలో లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందంతోపాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఉన్నారు. అయితే ఈవెంట్‌లో ఎర్రబెల్లి దయాకర్ రావు ఓ ఫొటో దిగుదామని బ్రహ్మీని చేయి పట్టుకుని అడిగారు. ఈ క్రమంలో బ్రహ్మానందం కొంచెం (సరదాగా) ఎర్రబెల్లి దయాకర్‌రావును లెక్కచేయనట్టుగా నో చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. ఎర్రబెల్లితో ఫొటో దిగేందుకు బ్రహ్మానందం నో చెప్పారంటూ కామెంట్లు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మానందం స్పందించారు. నేను ఉదయాన్నే ఓ వీడియో చూసి నవ్వుకున్నాను. నేను నిన్న మోహన్ బాబు ఫంక్షన్ వెళ్లిన టైంలో బాగా రాత్రి అయిందని హడావుడిగా ఉన్నా. అంతలోనే నాకు దయా అన్న ఎదురయ్యాడు. రాన్న రాన్న ఫొటో తీసుకుందామని దయా అన్న అంటే నేను ఫొటో వద్దు ఏమీ వద్దని అక్కడి నుంచి వచ్చేశా. అయితే అది చాలా మంది మిత్రులు అపార్థం చేసుకున్నట్టున్నారు. దయాకర్‌గారితో నాకు 30 ఏళ్ల అనుబంధం ఉంది. నాకు మంచి మిత్రులు. మేం ఫ్యామిలీ ఫ్రెండ్స్‌లా ఉంటాం. ఆయనతో ఉన్న చనువుతోనే అలా సరదాగా తోసేశాను. దాన్ని నేను కావాలనే చేసినట్టు కొంతమంది మీడియా మిత్రులు అపార్థం చేసుకున్నారు. ఈ వీడియో చూసిన ఆయన, నేను నవ్వుకున్నాం. ఈ విషయంపై క్లారిటీ ఇచ్చేందుకు ఈ వీడియో చేస్తున్నానన్నాడు బ్రహ్మీ.

# అది చాలెంజ్‌తో కూడుకున్న పని..

### హాట్ టాపిక్‌గా కీర్తిసురేశ్ కామెంట్స్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ కీర్తిసురేశ్ మహానటి సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న ఈ భామ తమిళం, తెలుగుతోపాటు పలు ప్రధాన భారతీయ భాషల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ బ్యూటీ ఫిట్‌నెస్‌పై కూడా మంచి ఫోకస్ పెడుతుందని తెలిసిందే. ఈ ముద్దుగుమ్మ ఓ విషయంలో ఇప్పటికీ ఫైట్ చేస్తుందట. ఇంతకీ ఏమిటా విషయమను కుంటున్నారా..?
కీర్తిసురేశ్ మంచి ఫుడ్ లవర్. ఈ విషయంలో ఇబ్బంది పడుతుందట. ఓ చిట్ చాట్‌లో ఇదే విషయమై కీర్తిసురేశ్ మాట్లాడుతూ.. ఫుడ్‌పై నాకున్న ఇష్టాన్ని నియంత్రించుకునే విషయంలో నేనిప్పటికీ నాతో నేనే ఫైట్ చేస్తుంటానని.. కఠినమైన డైట్‌ను ఫాలో అవడం తనకు చాలెంజ్‌తో కూడుకున్న పని అని చెప్పింది కీర్తిసురేశ్. మొత్తానికి ఓ వైపు ఫుడ్ విషయంలో బ్యాలెన్స్ తప్పుతున్న ఫిజిక్ మెయింటైన్ చేయడంలో మాత్రం కీర్తిసురేశ్ కాంప్రమైజ్ అవడం లేదని ఈ బ్యూటీ లుక్స్ చూస్తే తెలిసిపోతుంది. ఫిట్‌నెస్ జర్నీ విషయంలో తన అభిమానులకు స్ఫూర్తిగా నిలిచే కీర్తిసురేశ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# ఆ నలుగురు మావోయిస్టులను కస్టడీకి ఇవ్వండి

## కోర్టులో విజయవాడ పోలీసులు పిటిషన్

## నేడు విచారించనున్న న్యాయస్థానం



**తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 23**

మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్ కౌంటర్ అనంతరం ఏపీలో 50 మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు పంపించిన విషయం తెలిసిందే. అయితే వారిలో నలుగురిని కస్టడీకి ఇవ్వాల ని కోర్టును పోలీసులు కోరారు. వారి నుంచి మరింత సమాచారం సేకరించేందుకు వారం పాటు కస్టడీకి ఇవ్వాలని బెజవాడ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్పై ధర్మాసనం సోమవారం విచారించనుంది.కృష్ణా జిల్లాలో అరెస్ట్ అయిన వారిని కూడా.. కృష్ణా జిల్లాలో అరెస్ట్ అయిన 28 మంది మావోయిస్టులను సైతం కస్టడీకి ఇవ్వాలని కోరేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. మూడు దఫాలుగా వారందరినీ విచారిం చేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేయనున్నారు. మొదట 10 మందిని విచారించేందుకు రేపు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# విద్యార్థుల పస్తులు

**రిజిస్టర్ లో నాన్ వెజ్ .... పెట్టేది పచ్చడి మెతుకులు**

## మెనూ పాటించని సంక్షేమ హాస్టళ్లు ... గిరిజన జిల్లాలో విద్యార్థుల గోస

తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 17:

రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా మెస్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యంగా ఆహారం అందించాలని చెబుతున్న అవేవి అధికారులకు పట్టడం లేదు హాస్టల్ వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల నోటి కాది అన్నం కి మట్టికొడుతున్నారు రాష్ట్రాల్లోనే అతిపెద్ద గిరిజన బంజారా జిల్లాగా పేరుమోసిన మహబూబాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దారుణంగా వుంది లో మెనూ కూడా పాటించకుండా తమకు నచ్చిన విధిగా ఆహారమందిస్తూ పిల్లల కడుపు మాడుస్తున్నారు, ఆదివారం నాన్ వెజ్ పెట్టాలని మెనూ లో చెబుతుండగా కనీసం కోడిగుడ్డ కూడా ఇవ్వడం లేదు. ఇక మోడల్ స్కూల్ లో కనీసం విద్యార్థులకు ఉదయం అల్పహారం ఇవ్వడం లేదు . దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు ,

# మావోయిస్టు అగ్రనేత మడవి హిడ్మా ది బూటకపు ఎన్కౌంటర్

## హిడ్మా మరణం పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

## దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్.

**అల్లూరి జిల్లా, పాడేరు తొవ్వ ప్రతినిధి. నవంబర్ 23 :**

ప్రజా ఉద్యమకారులకు బూటకపు ఎన్కౌంటర్లు కేసులతో ఉద్యమాలను అణిచివేయలేరని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం అన్నారు. ఆదివారం పాడేరులో ఆదివాసి ఉద్యోగ ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసి హక్కుల చట్టాల కోసం సాయుధ పోరాటం చేస్తూ పోలీసుల చేతిలో బూటకపు ఎన్కౌంటర్లో వీర మరణం పొందిన మావోయిస్టు అగ్రనేత మాడవి హిడ్మకు ఉద్యమ జోహార్లు అర్పిస్తున్నామని, హీడ్మ పోరాటం మన్యం వీరుడు అల్లూరి స్ఫూర్తిగా ఉందన్నారు. అటువంటి ఉద్యమకారుడు ఆశయం ఎప్పుడు చనిపోదని ఆయన చెప్పారు. ఒక హిడ్మా మృతి చెందితే వేలాదిమంది హిడ్మాలుగా పుట్టుకొస్తారన్నారు.పేద బడుగు బలహీన వర్గాల హక్కులు చట్టాల కోసం ఆదివాసి ఉద్యోగ విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు పోరాటాలు చేయాలన్నారు.మావోయిస్టు నేత మడవి హిడ్మా ది బూటకపు ఎన్కౌంటర్ ని ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు.హిడ్మా ఎన్కౌట్ బూటకమని ప్రపంచమంతా కోడై కూస్తోందన్నారు.లొంగిపోవాలని పిలుపునిస్తూనే నిరాయుదాలుగా ఉన్న వారిని పట్టుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలకులు వారి స్వార్ధ రాజకీయాల కోసం కాల్చి చంపుతున్నారని, అలాగే ఉద్యమాలను అనిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎన్ని కుట్రాలు చేసిన ఉద్యమాలను అణిచివేయలేరని ఆయన అన్నారు.ఈ ఎన్కౌంటర్ సరైనది కాదని అందరూ అంటున్నారు.అందుకే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న



పాలకులు అందుకు విరుద్ధంగా తుపాకులతో కాల్చి చంపడమే నేరమన్నారు.మావోయిస్టులు కానీ పోలీసులు ఇన్ఫర్మర్ల హత్యలపై తాము తీవ్రంగా ఖండించామన్నారు.హిడ్మా లొంగిపోయేందుకు ఎందుకు అవకాశం కల్పించకుండా కాల్చి చంపారని ప్రశ్నించారు.దేశ స్వాతంత్ర్య సమరయోధులతో హిడ్మా ను పోలుస్తున్నారన్నారు. దేశ ద్రోహులను చంపిన నాటి ప్రభుత్వం నేడు వారి విగ్రహాలను పెట్టీ పూజిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.భూమీ,భుక్తి, విముక్తి కోసం పోరాడిన వ్యక్తి హిడ్మా అని కొనియాడారు.ఆయన ఎన్కౌంటర్ పై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన అవసరం పాలకులకు ఎంతైనా ఉందన్నారు.చర్చకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించిన పాలకులు ఎందుకు ముందుకు రాకుండా పట్టుకొని కాల్చి చంపుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రశ్నించారు.అన్ని వర్గాల వారు హిడ్మా హత్యపై చర్చించు కుంటున్నారు.అన్ని రాష్ట్రాల్లో ఈయన హత్యపై ప్రతి ఒక్కరు మాట్లాడుతున్నారు.2026 మార్చి లోగా లొంగిపోవాలని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం లొంగిపోయేందుకు వచ్చిన వారిని కాల్చి చంపటం సరైన పద్ధతి కాదన్నారు.ఇప్పటికైనా మావోయిస్టులతో కేంద్ర రాష్ట్ర



ప్రభుత్వాలు చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ఉద్యోగ ప్రజాశంగా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పీఎం జన్మన్ ఇంటి నిర్మాణంలో ప్రమాదం

## ఇంటి పై నుంచి పడి బాలుడు తీవ్ర గాయాలు

**అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి తొవ్వ ప్రతినిధి, నవంబర్ 23 :**



అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని డైలీ నగర్ గ్రామంలో పీఎం జన్మన్ పథకం కింద నిర్మాణం జరుగుతున్న గృహంలో ఓ బాలుడు ప్రమాదానికి గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన కొర్ర మహేష్ (7) ఆదివారం మధ్యాహ్నం ఇంటి పైకప్పుపై ఆడుకుంటుండగా ఆకస్మికంగా కాలుజారి కిందపడిపోయాడు. దీంతో అతని కాలు తీవ్రంగా గాయపడి పూర్తిగా విరిగిపోయింది. గ్రామస్తుడు కొర్ర మల్లుబాబు తెలిపిన వివరాల ప్రకారం పథకం కింద నిర్మాణం జరుగుతున్న పలుచోట్లపై భాగాల్లో రక్షణ గోడలు, భద్రతా చర్యలు లేకపోవడంతో పిల్లలు తరచూ ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. మహేష్ విషయంలో కూడా ఇదే కారణం ప్రమాదానికి దారితీసిందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అవసరమైన ఆర్థోపెడిక్ సదుపాయాలు లేకపోవడంతో వైద్యుల సూచన మేరకు బాలుడిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక అత్యవసర సేవలు కూడా అందకపోవడం పేద కుటుంబాలకు పెద్ద ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్ల కాలు విరిగినా మైదాన ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు? పేదలకు అత్యవసర వైద్యం అందించకపోతే ఇలాంటి ప్రాంతాల్లో ఎలా బ్రతుకాలి? అని ప్రశ్నిస్తున్నారు. గ్రామస్తులు పీఎం జన్మన్ గృహ నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

# మహబూబాబాద్ జిల్లా ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ డా. శభరీష్ .



**తొవ్వ మహబూబాబాద్ .డిసెంబర్ 29:**

మహబూబాబాద్ జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ డాక్టర్ శభరీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు ఎస్పీ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్ర భుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఈ క్రమంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన ఆయనను ములుగు ఎస్పీ గా బదిలీపై వెళ్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించి జిల్లా పరిధి అధికారులతో మాట్లాడినారు.అనంతరం కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి దర్శించుకున్నారు.

# పాఠశాల నేమ్ బోర్డు, గేటు ను అందించిన

## REWA జిల్లా అధ్యక్షులు సంకా బద్రి నారాయణ



**తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 22:**

మహబూబాబాద్ (%వీ[ూా +×=ూా%) ప్రాథమిక పాఠశాలకి నేమ్ బోర్డు, గేటు ను %=జుఔూ% జిల్లా అధ్యక్షులు శ్రీ సంకా బద్రి నారాయణ అందజేశారు . ఆదివారం పాఠశాల ఆవరణం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామోజీ నాయక్ మాట్లాడుతూ దాత బద్రి నారాయణ ను అభినందించినారు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇంకా దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వ పాఠశాల నాణ్యమైన విద్య అందుతుందన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కిషన్, సత్యవతి, నాగముని, వరలక్ష్మి ,లక్ష్మి, చామంతి ,సృజన, నవీన మరియు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

## ఇడెం స్వరూప సేవా సంస్థ సేవలు అభినందనీయం
### వెల్లంకి తాజా మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి




**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 23:**
రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలో ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ పేద ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,వెల్లంకి తాజా మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు గ్రామంలో సంస్థ అధ్యక్షులు ఇడెం రాధా శ్రీనివాస్ రెండు లక్షల రూపాయలతో సమకూర్చిన ప్యూరిఫైడ్ 20 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రింకింగ్ వాటర్ క్యాన్లను ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇడెం స్వరూప సేవా సంస్థ అధ్యక్షులు ఇడెం రాధా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కొరకు,గ్రామ పేద ప్రజల కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పన్నల వెంకటేశం, కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి, తలారి నరసింహ, గంజి రంగయ్య, సండ్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సింగారంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి.
### -సపవత్ రాందాస్ నాయక్.




బయ్యారం,తోవ్వ,నవంబర్ 23.:
బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ సహకారంతో సింగారం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు సపవత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు పంపిణి చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు బానోత్ అనూష 17 వేలు,గుగులోత్ ఆమర్ సింగ్ 22 వేలు,గుగులోత్ కుమారి 11 వేలు రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గంగావత్ రవి నాయక్,మాజీ ఎంపిటిసి గంగావతి గోపాల్ నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకుపల్లి రవి,గుగులోత్ అమర్ సింగ్,బదవత్ లాల్యా నాయక్ గూగులోత్ బద్రు నాయక్,గూగులోత్ మంగీలాల్ నాయక్,కుర్సం రవి, చుంచు బాలరాజు,బానోత్ భిక్కు నాయక్,గూగులోత్ మహేష్ నాయక్, గుగులోత్ రమేష్ నాయక్,చుంచు భానుచంధర్,సపవత్ సంతోష్, గంగవత్ శంకర్,బాధవత్ గణేష్,గోన్య నాయక్,మురారి తదితరులు పాల్గొన్నారు

# బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి,

## బాబాశతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టం,
## ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనలో ఉండాలి,
## ప్రముఖ దంత వైద్య నిపుణులు
## డాక్టర్ అనిల్ గుప్తా,





**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 23,**
శ్రీ భగవాన్ సత్యసాయి బాబా నూరు వసంతాల జన్మదిన సంబరాల్లో పాల్గొనడం చాలా అదృష్టంగా ఉందని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అనిల్ గుప్తా అన్నారు, ఆదివారం శ్రీ భగవాన్ సత్య సాయి బాబా నూరవ పుట్టినరోజు సందర్భంగా సాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డాక్టర్ అనిల్ గుప్తా అరుంధతి దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సేవాగుణం ఆధ్యాత్మిక ఉండాలని సంఘ సేవకు కట్టుబడి ఉంటూ బాబా చూపిన మార్గంలో నడవాలని అన్నారు. మనము చూడని రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వర స్వామి, లాంటి దేవుళ్ళతోపాటు ప్రత్యక్షంగా చూసిన భగవాన్ సత్యసాయిబాబా ను వెనకటి దేవుళ్లతో పాటు బాబాను కూడా దేవుడు అంత విధిగా ప్రతి ఒక్కరు తలుస్తూ ఉన్నారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమ జిల్లాకు ఇతర ప్రాంతాలకు ఎన్నో చెరువులు తోమిచ్చి మంచినీటి సరఫరాను ప్రతి గ్రామానికి అందించిన ఘనత తో పాటు, పుట్టపర్తిలో పెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టించి పేద రోగులకు వివిధ దేశాల నుంచి వచ్చిన రోగులకు భారతదేశంలోని అన్ని రాష్ట్రాల రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించిన ఘనత బాబాకు దక్కిందని, పుట్టపర్తిలో వైద్యశాల మెడికల్ కళాశాల డిగ్రీ కళాశాలలు ఎందరో విద్యార్థులకు విద్య అందించిన గొప్ప ఘనత బాబాదని అన్నారు. ఇప్పటికి కూడా ఆయన చూపెట్టిన మార్గంలోనే వైద్య సేవలు నడుస్తున్నాయని అన్నారు. ఆయన చూపిన మార్గంలోని నేను గ్రహణ మొర్రి బాధితులకు నా వంతు సహాయంగా వేలాది మంది గ్రహణమురులకు ఉచిత వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రతి రోగిని ఆదుకున్నప్పుడే మనసు ఆత్మ సత్తృప్తిగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ భగవాన్ సత్యసాయిబాబా చూపిన మార్గాల నడుస్తూ సేవా మార్గాలు చేయాలని ప్రతి ఆపద వచ్చిన మనిషికి ఉపయోగపడాలని అన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన
## ఇడెం శ్రీనివాస్..



**యాదాద్రి జిల్లాబీరామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 23:**
రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు కనుతాల రాజశేఖర్ రెడ్డి వివాహం రామన్నపేట పట్టణంలోని గరికే రాధేసత్య ఫంక్షన్ హాల్ లో జరిగింది. వారి వివాహానికి వెల్లంకి తాజా మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి ఇడెం స్వరూప సేవా సంస్థ అధ్యక్షులు ఇడేమ్ రాధా శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేశం, పిట్ట మహేందర్ రెడ్డి, ఈసం ప్రభాకర్ రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి,గంట కర్ణాకర్ రెడ్డి, వరికుప్పల కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు త్రాగి మహిళా మృతి

**తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 23**
క్షణికావేశంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బంజరలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై చిర్రా రమేష్ బాబు కథనం ప్రకారం మండలంలోని బంజర గ్రామానికి చెందిన గుగులోతు అరుణ (27) భర్త హుస్సేన్ తో చిన్న గొడవ జరగడంతో మనసులో పెట్టుకొని క్షణిక ఆవేశంలో పంట పొలాల అవసరం కోసం తీసుకువచ్చిన గడ్డి మందు త్రాగగా భర్త హుస్సేన్ ఆసుపత్రికి తరలించగా గత రాత్రి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతురాలి తండ్రి గుగులోతు మోతిలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.



## నిరుపేదలకు ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్




యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :నవంబర్ 23
గుడిసెల్లో కాలమేల్లాదీస్తున్న నిరుపేదలు అందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేసి ఇల్లు కట్టుకునే స్తోమత లేనివారికి ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునిపంపుల గ్రామ పరిధిలో ఉన్న బోటిమీద గూడెం లో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి కుటుంబ సర్వే నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని బోటిమీదగూడెంలో సంచార వెనుకబడిన వర్గాల ప్రజలు గత దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోక వెనుకబాటులో ఉంటూ గుడిసెలు వేసుకొని కాలమెల్లదీస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు పాక్షికంగా మంజూరు అయిన ఇంకా కొన్ని కుటుంబాలు గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయని. వానకు వణుకుతూ చలికి తడుస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అత్యంత నిరుపేదలు కావడంతో ఇంటి నిర్మాణానికి ముందు చేతి నుండి ఖర్చు పెట్టుకునే ఆర్థిక స్తోమత కూడా లేక అప్పుల పాలు అవుతున్నారన్నారు. ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునిపంపుల నుండి లక్ష్మాపురం వరకు రోడ్డు లేక వర్షా కాలంలో కనీసం నడవలేని పరిస్థితిలో ఉందని అనేక మార్లు విన్నవించినా ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా శిలాఫలకం వేశారు తప్ప రోడ్డు మాత్రం వేయలేదని వెంటనే రోడ్డు నిర్మాణం చేయాలని అన్నారు. మంచినీటి సౌకర్యం,డ్రైనేజీలు లేక వీధిలైట్లు సక్రమంగా వెలగక, చెరువు పరిసర ప్రాంతం కావడంతో ప్రతినిత్యం పాములతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే బోటిమీదిగూడెంలో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగం కృషి చేసి సమస్య పరిష్కారం చూపాలని అన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి నూతనంగా పెన్షన్లు రాక వృద్ధులు,వికలాంగులు, వితంతువులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగం చదవచ్చుపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కమిటీ సభ్యుడు త మండల కమిటీ సభ్యుడు తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్,ఉంద్రాతి నరసింహ, బూడిద బిక్షం,గునుగుంట్ల సత్యనారాయణ,మేడి భాషయ్య, శిరీషాల యాదగిరి, జోగుల సాయి కుమార్, పోగుల ఉపేందర్,ఉయ్యాల శ్రీనివాస్, కానుకుంట్ల ఉప్పలయ్య,బూడిద నర్సింహా,ఎండీ ఖలిమోద్దీన్,బూడిద ఆదిత్య, మేకల రవి, మేకల మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్లు
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
9398236146,7075529993

## జిల్లా కాంగ్రెస్ నూతన సారధి డాక్టర్ ఉమా మురళి నాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

**తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 23:**



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా అఖిలభారత కాంగ్రెస్ రాష్ట్రంలో జిల్లాలలో నూతన సారధులను నియామకం చేపట్టింది. అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు అధ్యక్షులుగా మాజీ ఏఐసీసీ మహిళా కమిటీ సభ్యురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్, మహబూబాబాద్ ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ ఉమా మురళి నాయక్ ను నియామకం చేసింది. నూతనంగా నియామకమైన సందర్భంగా మండలంలోని మునిగలవీడు మాజీ సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు, మండల నాయకులు బండ ఉపేందర్ లు ఆదివారం మహబూబాబాద్ లోని వారి స్వగృహంలో డాక్టర్ ఉమా మురళి నాయక్ దంపతులను కలిసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ ఉమా మురళి నాయక్ దంపతుల సారధ్యంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఆమె నియామకంతో మహిళలకు పెద్దపీట వేసినట్లు అయిందన్నారు. త్వరలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధించడంఖాయమన్నారు.

## ఏ పి ఎల్ ప్రారంభించిన మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్ ప్రజా గళం దామర భూపాల్



**తొవ్వ, ప్రతినిధి, ఇబ్రహీంపట్నం, నవంబర్ 23**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా ఏపీఎల్ సీజన్ 5 క్రీడలు జరుగును ఇట్టి కార్యక్రమంలో క్రీడాకారులకు శారీరకంగా బలంగా తయారవుతారని ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని క్రికెట్ టోర్నమెంట్ అనేది నిర్వహించడం జరుగుతది ప్రజా గళం మాట్లాడుతూ క్రీడాకారులు చెడలవాటు దూరం చేసుకుని తన శరీరాన్ని కాపాడుకొని క్రీడాలలో మండల స్థాయి నుండి జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎదిగి దేశానికి ప్రాతినిత్యం మాయించవలసిందిగా క్రీడాకారులకు తెలపడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఎంపీటీసీ చీరాల రమేష్ మాజీ చిందం జంగయ్య మార బుగ్గ రాములు లాల గారి జంగయ్య మార్కెట్ కమిటీ మాజీ నెంబర్ జానీ పాషా ప్రజా గళం భూపాల్ తదితరులు పాల్గొన్నారు

## విజ్ డమ్ హైస్కూల్ లో ఘనంగా జరిగిన ఎన్ సి సి డే వేడుకలు.

**తొవ్వ ,నర్సంపేట, నవంబర్ 23,**




10 (%u%) బెటాలియన్, వరంగల్ ఆధ్వర్యంలో నవంబర్ 23 న ఎన్ సి సి డే సందర్భంగా విజ్ డమ్ హై స్కూల్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ %ఆ% ప్రిన్సిపాల్ జావేద్ క్యాడెట్లనుద్దేశించి మాట్లాడుతూ ముందుగా క్రమశిక్షణతో కూడిన నాయకత్వాన్ని ప్రపంచ దేశాల్లో మన దేశం అత్యధిక యువతను కలిగిన దేశమని, ఇటువంటి యువతను సక్రమ మార్గంలో పయనించేలా చూడాలని, ఎన్సిసి వలన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, దేశ సమగ్రత, క్రీడా స్ఫూర్తి, మతసామరస్యం, లౌకికవాదం, బలపడుతుందని వారు తెలిపారు. గత కొన్నేళ్లుగా ఎన్సిసి అనూహ్యంగా అభివృద్ధి చెందిందని, యూనిఫాంలో ఉన్న యువత దేశ నిర్మాణానికి సహకరిస్తున్నారని వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ తెలిపారు. సమాజ సేవకులుగా, దేశభక్తులుగా ఎదగడానికి తోడ్పడే ఎన్సిసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేడేట్లకు పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, థర్డ్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు రియాజ్, మధు, రాజేష్, రవీందర్, రాకేష్, అనూప, చందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పెయింటింగ్, వ్యాసరచన, డ్యాన్స్ తదితర విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరచిన కేడట్లకు బహుమతులను అందజేశారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

**తొవ్వ ,ప్రతినిధి , నవంబర్ 23’**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పట్టణ పద్మశాలి సంఘం భవన్‌లో ఎన్నికలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం%-%భద్రాద్రి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు పుట్ట శంకరయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఎంపిక చేశారు ,.ఎన్నికల పరిశీలకులుగా ఐత కిషన్, సంజీవ్, రిటర్నింగ్ ఆఫీసరుగా శ్రీ వి. మధుకర్ ITDA అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట నారాయణ , వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.ఎన్నికైన నూతన కార్యవర్గం,అధ్యక్షులుగా : పి. వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు: ఎం.డి. బాబ్జి,కార్యదర్శి: వి.వి.జి. కృష్ణ,ట్రెజరర్: కణితి నరేష్ ఎన్నుకున్నారు నూతన పదవుల్లో ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో సైక్లింగ్ క్రీడాభివృద్ధి, క్రీడాకారుల పురోగతి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కురవి లో ఘనంగా సత్యసాయి శతాబ్ది వేడుకలు

### హాజరైన అతిథుల చిత్రమాలిక



## మాధన్నపేట చెరువులో చేపపిల్లల విడుదల చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

.



**తొవ్వ,నర్సంపేట నవంబర్ 23,**

నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలోని మాధన్నపేట చెరువులో చేప పిల్లలను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తో కలిసి శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డివిడుదల చేశారు. మొత్తం 6 లక్షల 81 వేల చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెద్ద చెరువైన మాధన్నపేట మత్స్య సహకార సంఘంలోని ప్రతీ సభ్యుడు చేపల పెంపకం లో నైపుణ్యం పెంపొందించుకొని ప్రైవేట్ వ్యక్తులకు చేపల ఉత్పత్తిని అప్పగించకుండా వారే నిర్వహించాలని కోరారు. మొత్తం 11 లక్షల 50 వేల విలువైన చేప పిల్లలు విడుదల చేసినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధిలో మత్స్యోత్పత్తి చాలా కీలక పాత్ర పోషిస్తుందని, ఈరోజు చేప పిల్లలను చెరువులో వదిలించడం ద్వారా స్థానిక మత్స్యకారుల ఆదాయం పెరగడమే కాకుండా, ప్రజలకు పోషకాహార భద్రతను కూడా మెరుగుపరచడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం చేపల పెంపకానికి అవసరమైన అన్ని రకాల సహాయాలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు.రైతులు, యువకులు, మహిళా సంఘాలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రాంరెడ్డి , మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి ,మార్కెట్ చైర్మెన్ పాలాయి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.